# విమానం కొనిపెట్టు నాన్నా !

ఆకాశంలో విమానం వెళ్తున్న శబ్దం విని ఇంట్లో నుంచి గబగబా బయటకు పరుగెత్తుకొచ్చాడు ఎనిమిదేళ్ళ వాసు. విమానం కనుమరుగయ్యేంతవరకూ ఎత్తిన తలను దించలేదు. విమానం చూసిన సంబరంలో చేతులు గాలిలోకి ఊపాడు.

సూరెయ్య కూడా ఆకాశంకేసి చూశాడు. పశ్చిమదిక్కున కమ్ముకొస్తున్న నల్లని మేఘాలపై అతని దృష్టి పడింది. "వర్షం రాకుండా ఉంటే బావుణ్ణు!" అనుకున్నాడు మనస్సులో. వరిచేలు బిర్రుపొట్టమీద ఉన్నాయి. ఇప్పుడు వర్షం కురిస్తే కంకుల్లో తాలుగింజలు వస్తాయి.

"నాన్నా! విమానం కొనిపెట్టు" అడిగాడు వాసు.

"ఎందుకురా విమానం? సైకిల్ కొనిస్తాలే" అన్నాడు సూరెయ్య. కొడుకు మూతి కండువాతో తుడుస్తూ.

"సైకిల్ భూమి మీదే తిరుగుతుంది. విమానం ఆకాశంలో అందరికంటే ఎత్తులో తిరుగుతుంది. విమానం ఎక్కి అమెరికా వెళతా!" అన్నాడు వాసు.

మూడోతరగతి చదువుతున్న వాసు బుర్రలో అమెరికా ఆలోచన ఎందుకు వచ్చిందో సూరెయ్యకు అర్థంకాలేదు. సుబ్బరామయ్య కొడుకు నవీన్ గుర్తుకు వచ్చాడు ఆ క్షణంలో. అమెరికా వెళ్లి పదిహేనేళ్లు అవుతుంది. కోట్లు సంపాదించాడు. తండ్రిని కూడా అమెరికా తీసుకువెళ్లి అన్ని ప్రదేశాలు తిప్పి చూపించాడు.

ఊళ్ళో అమెరికా చూసింది సుబ్బరామయ్య ఒక్కడే! ఎంత అదృష్టవంతుడు! విమానం ఎక్కి అమరికా వెళ్ళాడు.... సుబ్బరామయ్య అమెరికాలో ఆరునెలలకు మించి ఉండలేక అమృతలూరు తిరిగి వచ్చేశాడు.

ఎనభైయ్యేళ్లు వచ్చాయి. భార్య చనిపోయింది. వంట చేయడానికి వంటమనిషిని, సుబ్బరామయ్యకు సహాయంగా దేనికీ ఇబ్బందిపడకుండా చూసుకోవడానికి పనిమనిషిని నెలకు రెండు వేలిచ్చి కుదిర్చాడు కొడుకు. ఏది కావాలన్నా వంటమనిషి వండిపెడుతుంది. ఇంట్లో మరో మనిషి కంటికి రెప్పలా చూస్తూ ఉంటాడు. ఏది కావాలన్నా అమర్చుతాడు. అదృష్టం కాక మరేమిటి?.....

నవీన్ స్నేహితుడు పొన్నూరులో పెద్ద డాక్టరు. అతను వారానికి ఓసారి ఊరికి వచ్చి సుబ్బరామయ్యను పరీక్షచేసి మందులు ఇచ్చి వెళతాడు.

సుబ్బరామయ్య పొలం తనే కౌలుకు చేస్తున్నాడు. నవీన్ తనకు మరీ మరీ చెప్పాడు. "మా తండ్రి తదనంతరం ఆయన పొలం మీకు తక్కువ ధరలో అమ్ముతాను. మీరు మా నాన్నను కంటికి రెప్పలా చూసుకోండి. మా దగ్గర ఉండమంటే ఉండలేనంటాడు. సొంత ఊరిలోనే ఉండడం ఆయనకు ఇష్టం. అమ్మ చనిపోయాక నాన్న కొంచెం దిగులుగా కనిపిస్తున్నాడు. మీరు రోజూ మా ఇంటికి వెళ్లి మా నాన్నను పలకరిస్తూ ఉండండి. కొడుకు దగ్గరలేడనే భావన ఆయనకు రానివ్వకండి.

.... ఏ కొడుకయినా తన తండ్రికి అంతకుమించి ఏం చేయగలుగుతాడు?.....

మళ్లీ అడిగాడు వాసు విమానం కొనిపెట్టమని.... చంద్రుడితో ఆడుకుంటాను. తీసుకురమ్మని శ్రీరాముడు మారాంచేస్తే చంద్రుడిని అద్దంలో చూపించి సంతృప్తి పర్చారట. అద్దంలో చంద్రుడిని చూసి ఆనందపడిన రాముడు రామచంద్రుడయ్యాడు.

వాసును కూడా మాయ చేయాలి.

"పొన్నూరు వెళ్లి విమానం బొమ్మ కొనుక్కు వస్తాను. దానితో ఆడుకో. ముందు అది ఎలా ఎగురుతుందో చూడు. పెద్దయ్యాక అసలు విమానంలో తిరుగుదువుగాని" అన్న నూనెయ్య మాటలు వాసుకి సంతృప్తిని కల్గించాయి.

సుబ్బరామయ్య ఇంటివైపు బయల్దేరాడు నూనెయ్య. ఊరికి ఆవలివైపు ఆయన ఇల్లు, మట్టిదిబ్బ దాటుకుని వెళితే శివాలయం వస్తుంది. మట్టిదిబ్బ మీద ఉన్న పెద్ద చింతచెట్టువైపు దృష్టిసారించాడు.

పాలపొంగులా తండ్రితో తనకున్న అనుబంధం తోలూకూ గత స్మృతులు మదిలో మెదిలాయి.

.... తండ్రి ఆజానుబాహువు..... పెద్ద మీసకట్టుతో గంభీరంగా ఉండేవాడు. ఊళ్ళో పెద్దగా ఎవరితో మాట్లాడేవాడు కాదు. లేదా వాళ్ళే అంతగా ఆయనతో మాట్లాడటానికి ఇష్టపడేవాళ్ళు కాదు. ఎప్పుడూ పొలాల వెంటబడి తిరుగుతూ రాగాలాపన చేస్తూ ఉండేవాడు.

సాయంత్రం పూట రోజూ చింతచెట్టుకింద కూర్చుని మురళి వాయించేవాడు. 'మోహనరాగం' ఇలా వాయించాలి. 'భూపాల రాగం' వాయిస్తుంటే అప్పుడే సూర్యుడు ఉదయిస్తున్నంత భ్రాంతి కలగాలి– అని సంగీతంగురించి చెబుతూ తనచేత కూడా సంగీతసాధన చేయించేవాడు. తనకూ మురళీ వాయించడం నేర్పించాడు.

మంచుకురిసే ఉదయాన తళుక్కున మెరిసే సూర్యకిరణంలా ఆయన చెట్టుకింద కూర్చుని మురళి వాయించే నృత్యం సౌందర్య భరితంగా ఉండేది. నాన్న ఇచ్చిన మురళిని గుడ్డచుట్టి ట్రంకు పెట్టెలో భద్రంగా దాచేడు. మురళి వాయించే తీరికే దొరకడంలేదు.

.....ఆ చింతచెట్టును చూస్తే ఎంతో సంతోషం.... తండ్రి గుర్తుకు వస్తాడు. మురళీనాదం విన్పిస్తూంది. ఊరంతా నిద్రపోతున్నప్పుడు వెన్నెలరాత్రి ఆరుబయట కూర్చుని మురళి వాయిస్తుంటే ఎంత బాగుంటుంది!

వ్యవసాయంలో పడ్డాక అన్నీ మర్చిపోయాడు. సాగుకు నీరు అందుతుందా లేదా....? పంట చేతికి వస్తుందా.... రాదా? గిట్టుబాటు ధర పండిన పంటకు వస్తుందా... కన్నీళ్ళు మిగులుతాయా? అన్నీ సమస్యలే!

ఇరవయ్యేళ్ళ నుంచి వ్యవసాయం చేస్తున్నాడు ఏం లాభం? ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయాడు. అప్పుల గోతులు తవ్వడం.... పూడ్చడం.... ఏళ్ళు గడచిపోతున్నాయి.

పెట్టెలో నుంచి మురళిని తీయాలి. మనస్సుకు ఆహ్లాదం కల్గించేది మురళీనాదమే! సుబ్బరామయ్య ఇంటివైపు వడివడిగా అడుగులువేశాడు నూనెయ్య.

❖ ❖ ❖

ఆకాశంలో విమానం వెళ్తున్న శబ్దంవిన్పించి తలపైకెత్తి చూశాడు సుబ్బరామయ్య. ఎంతసేపు ఆకాశంకేసిచూసినా విమానం జాడ కన్పించడంలేదు. శబ్దంమాత్రం విన్పిస్తూ ఉంది.

....విమానం ఆకాశంలో వెళ్తూ ఉంది. కంటికి మసక వచ్చింది... చూపు ఆనడంలేదు.... విమానం కన్పిస్తే అదో తృప్తి. ఆ విమానంలో తన కొడుకు ఉన్నాడు.

తనను చూడటానికి వస్తున్నాడు, నవీన్ చిన్నప్పుడు-

"కారు కొనిపెట్టు నాన్నా?" అడిగాడు నవీన్.

ఊళ్ళో పెద్దరైతు తను. అందరిలా సైకిళ్ళు, కార్లు, రైలుఅడగడం తక్కువగా ఆలోచించడమే! అనుకున్నాడు తను. తన కొడుకు అందరికీ అందనంత ఎత్తులో ఉండాలి. ఎప్పుడూ విమానాల్లో తిరగాలి.... 'విమానం కొనిపెట్టునాన్నా!' అని అడగాలి గాని....

తను అనుకున్నట్లే కొడుకు ఎవరికీ అందనంత ఎత్తులో ఎగురుతూనే ఉన్నాడు. వారం రోజుల్లో నాలుగురోజులు విమానాల్లోనే తిరుగుతాడట. దాదాపు పాతిక దేశాలు విమానాల్లో చుట్టి వచ్చాడట.

ఊళ్ళో అందరూ భూమి మీద నిలబడి ఆకాశంలో పక్షిలా ఎగిరే విమానాన్ని చూడడమేగాని విమానం ఎక్కి ఎరగరు. తన కొడుకు ఎంత అదృష్టవంతుడు?

ఆకాశంలో సూర్యుడు మండిపోతూ ఉన్నాడు. ఎటు చూసినా ఎర్రగా మంటలే కన్పించాయి. ఆకాశం మండిపోతుంది. విమానం కూడా మండిపోతుందా? ఆ విమానంలో ఉన్న తన కొడుకు మంటల్లో చిక్కుకున్నదా? ఆకాశంకేసి చూడలేక కళ్ళు మూసుకున్నాడు.

ఉదయం ఆరుబయట కుర్చీవేసి కూర్చోబెట్టారు. ఎండ వచ్చేసింది. ఇంటి వసారాలో చేరుకోవాలి. మధ్యాహ్నం పన్నెండయ్యేక పడకగదిలో చేరుకుంటాడు. సాయంత్రం అయ్యేవరకు అక్కడే కాలక్షేపం. సాయంత్రం మళ్లీ ఆరుబయటకు తీసుకువస్తారు. ఎదురుగా చెట్లవైపు చూస్తారు. విసుగుపుడితే ఆకాశంలోకి చూస్తాడు. విమానం కన్పిస్తే పండగే! కన్పించి చావదు, మసకవచ్చింది.

చదువుఅయ్యేక 'రైస్‌మిల్లు పెట్టించి మన ఊళ్ళోనే ఉంటాను నాన్నా' అన్నాడు నవీన్.

"ఇంజనీరింగ్ చదివి పల్లెటూళ్ళో ఉండటం ఏమిటి? హైద్రాబాద్‌లో నీ చదువుకి మంచి ఉద్యోగం దొరుకుతుంది. అక్కడికి వెళ్లు" అన్నాడు సుబ్బరామయ్య.

"మనకు పొలాలున్నాయి. అవి చూసుకుంటూ ఇక్కడే ఏదోఒక వ్యాపారం చేసు కుంటూ హాయిగాఉండొచ్చు" నసిగాడు నవీన్. అందరిలా వ్యవసాయం చెయ్యడం ఇష్టం లేదు. తన కొడుకుఉన్నతస్థాయిలో ఉండాలనికోప్పడ్డాడు. హైద్రాబాద్‌లో ఉండిపోయాడు.

సంక్రాంతి పండుగకు పిల్లలను తీసుకుని అమృతలూరుకు వచ్చాడు నవీన్. "మన ఊళ్ళోఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది నాన్నా" అన్నాడు.

"అమెరికా వెళ్ళే అవకాశంలేదా?" అడిగాడు.

"ఎందుకు లేదు. వెళ్ళాలనుకుంటే ఎప్పుడైనా వెళ్ళొచ్చు. నా చదువుకీ, నైపుణ్యానికీ అక్కడ మంచి ఉద్యోగమే దొరుకుతుంది" అన్నాడు నవీన్.

"గోళ్ళు గిల్లుకుంటూ హైద్రాబాద్‌లో ఎందుకు? అమెరికా వెళితే బోలెడంత సంపాదించవచ్చుగా! టాటాలు, బిర్లాలకు ఏం తక్కువైందని ఇంకా సంపాదిస్తున్నారు? పిచ్చివాగుడు కట్టిపెట్టి చేవ ఉంటే అమెరికా వెళ్లు.... సంపాదించు" అన్నాడు తను.

వాడికి పౌరుషం వచ్చింది. రెండు నెలలు తిరక్కముందే అమెరికా వెళ్ళిపోయాడు. "మీకు ఒక్కగానొక్క కొడుకు. బోలెడంత ఆస్తి ఉంది. కొడుకును అమెరికా పంపించా రెందుకు" ఊళ్ళో వాళ్ళు అడిగారు.

"అమెరికా వెళ్ళడాన్ని గుడ్డిగా వ్యతిరేకించకూడదు. మన దేశంలో కంటే ఆ దేశంలో నైపుణ్యాన్ని పెంచుకునే అవకాశాలు ఎక్కువ. మావాడు అక్కడ అన్నీ నేర్చుకున్నాక తిరిగి ఇక్కడకు వచ్చేస్తాడు" అన్నాడు తను.

మొదటిసారి రెండేళ్ళకు వచ్చాడు భార్యను, పిల్లల్ని తీసుకుని. వాడి అత్తగారు హైద్రాబాద్‌లో ఉండడంతో నెలరోజులు అక్కడే ఉండిపోయారు. తన దగ్గర వారం రోజులే ఉన్నారు. మనవడిని, మనవరాలిని చూసి ఎంతో మురిసిపోయాడు. అమెరికా వాతావరణానికి మరింత రంగుతో బంగారం బొమ్మల్లా మెరిసిపోయారు.

ఊళ్ళో వాళ్ళకు మనవడిని, మనవరాలిని చూపించి గర్వంతో ఊగిపోయాడు. ఆ సంతోషం వారంరోజులే! తిరుగు ప్రయాణమయ్యారు. ఐదేళ్ల గడిచేక పిల్లల్ని, భార్యను హైద్రాబాద్‌లో ఉంచేసి కొడుకొక్కడే వచ్చాడు.

"పిల్లల్ని తీసుకురాలేదేం?"

"కిందటిసారి ఇక్కడకు తీసుకువచ్చినప్పుడు పిల్లలకి జ్వరాలు వచ్చాయి. మన ఊళ్ళో దోమలు ఎక్కువ. చాలా ఇబ్బందిపడ్డాం. అందుకనే తీసుకురాలేదు.

మిమ్మల్ని హైద్రాబాద్ తీసుకువెళ్తాను. రెండుమూడు రోజులు అక్కడ ఉండి తిరిగి వద్దురుగాని" అన్నాడు నవీన్. వియ్యంకుడి ఇంటికివెళ్లి తన ఆస్తికీ వారసుడైన మనవడిని

చూడాలంటే అవమానంగా అన్పించింది. అయినా తప్పలేదు. వెళ్ళొద్దను కున్నాడుగాని, భార్య గొడవచేయడంతో హైద్రాబాద్ వెళ్ళివచ్చాడు. రెండురోజుల ముచ్చట అయిపోయింది.

స్వగ్రామం తిరిగివచ్చాడు. భార్యకి దిగులు ఎక్కువైంది. కొడుకు వాడి పిల్లలు దూరంగా ఉంటున్నారని, తొందరగా రమ్మని ఎన్నిసార్లు ఫోనుచేసినా నవీన్‌రాలేదు. ఐదేళ్ల గడిచేక ఒక్కడే వచ్చాడు.

"మీ ఆవిడను, పిల్లల్ని తీసుకురాలేదేం?"

"పిల్లలు ఇండియాకు రావడానికి ఇష్టపడడంలేదు. ఇక్కడకు వస్తే వాళ్లకు బోర్ కొడుతుందట. వాళ్ళను వదిలేసి మీ కోడలు రావడానికి ఇష్టపడలేదు. అందుకే మిమ్మల్ని చూడాలన్పించి నేనొక్కడ్నే వచ్చాను."

"వాడు తిరిగి వెళ్ళిపోయేక వారంరోజులకే మంచం ఎక్కింది వాళ్ళమ్మ. భార్య ఆఖరిక్షణాల్లో కొడుకు దగ్గరలేడు. ఆమె చనిపోయిన పదిరోజులకు వచ్చాడు.

"ఇక్కడే ఉండిపోకూడదూ" అడిగాడు కొడుకును.

అదే మొదటిసారి తను అధైర్యపడడం.

"ఇప్పుడెలా కుదురుతుంది. పిల్లల చదువులు కుంటుపడతాయి. ఇక్కడ నాకు తగిన ఉద్యోగం దొరకదు. అదీకాక పిల్లలు ఇక్కడ ఉండలేరు" అన్నాడు వాడు.

కదిలిపోతూ ఉంది కాలం కంటిరెప్ప మూయకుండా. ఎండ బాగా ఎక్కువైంది. తను కుర్చీలో నుంచి లేచి అడుగులు వేసుకుంటూ వరండాలో చేరుకునే ఓపిక లేదు. వంటమనిషి ఇంకా రాలేదు. తనకు సహాయం ఉండే రాములు కూడా ఏదో పనిమీద బయటకు వెళ్ళాడు. ఒళ్ళు చురుక్కుమంటున్నా ఎండలో అలాగే కుర్చీలో కూర్చోక తప్పలేదు సుబ్బరామయ్యకి.

మళ్ళీ ఆకాశంలో విమానం వెళ్తున్న శబ్దం. ఆర్తిగా ఆకాశంకేసి చూశాడు. ఆకాశంలో ఎగురుతున్న గద్దకన్పించింది అస్పష్టంగా. ఆ పక్షి కూడా తక్కువ ఎత్తులో ఎగురుతుండడంతో కన్పించింది. విమానం కన్పించకపోవడంతో నిరాశపడ్డాడు. తనెప్పుడు విమానం ఎక్కేది? పాతజ్ఞాపకాలను తడమి చూసుకున్నాడు.

ఎప్పుడో పదేళ్ల క్రితం నాటి సంగతి. కొడుకు మరీ ఒత్తిడి చేయడంతో డెబ్బైరెండేళ్ల వయసులో విమానం ఎక్కి అమెరికా వెళ్ళాడు. ఇరవై గంటలకు పైగా విమానంలో

కూర్చోవాలంటే విసుగొచ్చింది. కాళ్ళు పట్టేశాయి. మబ్బులు తప్పితే మరేం కన్పించలేదు.

విమానంపైన ఎగురుతున్నంతసేపు రైలు, బస్సు ప్రయాణమే బాగుంటుం దనుకున్నాడు. అక్కడ నవ్వుతూ, తుళ్ళుతూ గలగలా మాట్లాడుకుంటూ ప్రయాణం చేస్తారు. కానీ విమానంలో అందరూ మూతిబిగించుకుని కూర్చోవడం నచ్చలేదు. డిస్నీలాండ్, హాలీవుడ్... షాపింగ్ కాంప్లెక్స్‌లు, మంచుకొండలు చూపించాడు నవీన్. అంతా మాయా ప్రపంచంలా అన్పించింది.

కొడుకు ఉండేది చెక్కతో చేసిన భవనం. చుట్టుప్రక్కల వాళ్ళు ఎవరూ మాట్లాడించరు. పగలు, రాత్రి ఇంట్లోనే! అన్నింటికంటే తను భరించలేకపోయింది ఒక్క విషయంలో. మనవడికి, మనవరాలికి తెలుగురాకపోవడం, అప్పుడప్పుడు వాళ్ళు వచ్చి తన ప్రక్కన కూర్చోవడం "గ్రాండ్‌పా" అంటూ వాటేసుకోవడం ఏదో ఇంగ్లీషులో మాట్లాడడం. వాళ్ళ మాట్లాడేది తనకు అర్థంకాదు. తను మాట్లాడేది వాళ్ళకు అర్థంకాదు.

'తాతా! అని మనవడి చేత తనివితీరా పిలిపించుకోలేకపోవడం పెద్ద విషాదం. వడిలిపోతున్న వృద్ధాప్యపు ముడతలతో కన్పించేవన్నీ గాయాలే! ఆరునెలలు తిరక్కముందే తిరిగి వచ్చేశాడు. వెచ్చటి కన్నీరే మిగిలింది.

మరింత వివరంగా కొడుకుతో తనకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకోవాలని ప్రయత్నించాడు. మెదడు సహకరించడంలేదు వెనుకటిలాగా. పాత విషయాలన్నీ గుర్తుకు తెచ్చుకోలేకపోతున్నాడు. ఎన్నో విషయాలు మర్చిపోయాడు. ఎక్కువసేపు కుర్చీలో కూర్చోవాలన్నా కూడా ఇబ్బందే! ఒళ్లంతా నొప్పులు.

....'నువ్వు చనిపోయినా నేను రావడానికి ఇబ్బందే! విమానంలో సీటు దొరకదు' తనతో అలా కొడుకు అన్నట్లు కన్పించింది. కొడుకు అలా అన్నాడా? అలా అన్నట్లు తను భ్రాంతిలోపడ్డాడా? ఏ విషయం గుర్తుండి చావడంలేదు. విమానం వస్తున్నట్లు అన్పించింది.

మరో గంటలో కొడుకు విమానం దిగి ఇంటికి వచ్చేస్తాడు... వాడికి గట్టిగా చెప్పాలి... "ఇక్కడే ఉండిపో, ఎక్కడికీ వెళ్ళక ఇక్కడే ఉండిపో" అని.

నూనెయ్య వచ్చాడు అదేసమయంలో.

"ఏం పెద్దయ్యా, ఎండలో కూర్చున్నావ్?" అంటూ ప్రక్కన నిలబడి పలుకరించాడు.

"ఇంట్లో ఎవరూ లేరు. లోపల పడుకోబెట్టు" అన్నాడు సుబ్బరామయ్య. రెండు చేతులతో అవలీలగా సుబ్బరామయ్యను ఎత్తుకుని వరండాలో మంచంమీద పడుకోబెట్టాడు.

"చివరి మజిలీ" గొణుక్కున్నాడు సుబ్బరామయ్య.

"మంచినీళ్ళు తాగుతావా పెద్దయ్యా?" అడిగాడు నూనెయ్య. తెచ్చిపెట్టమన్నట్లు సైగ చేశాడు. మంచినీళ్ళు తాగుతుంటే గొంతు పొలమారింది సుబ్బరామయ్యకు.

"నీ కొడుకు తలుచుకుంటున్నాడేమో!"

అవునన్నట్లు తలూపాడు సుబ్బరామయ్య.

"నా కొడుకు సైకిలు ఎక్కి తిరుగుతానంటే విమానం ఎక్కమన్నాను. అదే నేను చేసిన పెద్ద తప్పు" అన్నాడు సుబ్బరామయ్య వచ్చే దగ్గుతెర ఆపుకునే ప్రయత్నం చేస్తూ. నూనెయ్య, సుబ్బరామయ్య ఛాతీ నిమిరాడు. కొద్దికొద్దిగా నీళ్ళు తాగించేడు.

"అదృష్టవంతుడిని పెద్దయ్యా... మహారాజులా గడిచిపోతుంది నీ జీవితం. నీకు సేవచేయడానికి ఇద్దరు మనుషులు. దేనికీ లోటులేకుండా జరిగిపోతుంది" అన్నాడు నూనెయ్య. వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు సుబ్బరామయ్య. చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు.

"ఏమిటీ పెద్దయ్యా.... ఏమయ్యింది?"

"చివరిదశలో నా కొడుకు చేత చేయించుకోవాల్సిన సపర్యలు వేరే వాళ్ళతో చేయించుకోవాల్సి వచ్చింది" అన్నాడు సుబ్బరామయ్య. పెద్దాయన ఎందుకు బాధపడు తున్నాడో అర్థమైంది నూనెయ్యకి. "ధైర్యంగా ఉండాలి పెద్దయ్యా..... మీ వాడికి ఫోనులో చెబుతాలే తొందరగా వచ్చెయ్యమని" సముదాయించాడు.

వంటమనిషి రాగానే అక్కడి నుండి కదిలాడు. ఎదురొచ్చిన పెద్దమనిషి నూనెయ్యని పలుకరించాడు. "ఏం నూనెయ్యా! సుబ్బరామయ్యను వదిలిపెట్టడంలేదు. నీ కొడుకును కూడా అమెరికా పంపాలనుకుంటున్నావా?"

ఉలిక్కిపడ్డాడు నూనెయ్య. తనకూ వాసు ఒక్కడే కొడుకు. వాడు అమెరికా వెళ్ళిపోతే చివరిదశలో ఇతరుల దయాదాక్షిణ్యాల మీద బతకాల్సిందే! కొడుకును విమానం కొనాలనే పిచ్చి ఎందుకు కలిగింది?

ఇంటికి పరుగెత్తాడు నూనెయ్య. పెట్టెలో మురళిని బయటకు తీశాడు.... తను

మనోహరంగా వాయించాలి. ఆ వేణుగానానికి వాసు పరవశుడైపోవాలి. తను సరిగ్గా మురళి వాయించలేకపోతే కొడుకు దూరమైపోతాడు. వాసు విమానం సంగతి మర్చిపోయి వేణుగానం విని మైమరచిపోవాలి. మర్చిపోయిన పాతస్వరాలను పలికించే ప్రయత్నంలో ఉన్నాడు సూరెయ్య.

❖ ❖ ❖

వరండాలో మంచంమీద కూర్చున్న సుబ్బరామయ్యకి విమానం పెద్ద శబ్దం చేసుకుంటూ వచ్చి ఇంటిముందు ఆగినట్లు అన్పించింది.

కళ్ళు నులుముకుని బయటకు తేరిపార చూశాడు.

తెల్లటి విమానం... మెరిసిపోతూ కన్పించింది.

కొడుకే పంపించాడు. సొంత విమానం. పుష్పక విమానం. ఇక ఆలస్యమెందుకు. విమానం ఎక్కాలి. రెక్కల విమానం ఎక్కాలి. లేచి నిలబడబోయాడు సుబ్బరామయ్య. తూలు వచ్చిపడిపోయాడు మళ్ళీ లేవలేదు.

– స్వాతి సపరివారపత్రిక, 22 జూలై 2011